క్లుప్తంగా

సిద్ధం సభ విజయవంతం చేసినందుకు ధన్యవాదాలు


వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల : ప్రొద్దుటూరు కేంద్రంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి తలపెట్టిన మేమంతా సిద్ధం సభను విజయవంతం చేసినందుకు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు, పులివెందుల వైఎస్సార్ పార్టీ మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. గురువారం ఆయన ఒక ప్రకటనలో సిద్ధం సభకు పులివెందుల మున్సిపాలిటీ నుంచే కాకుండా తాలూకాలోని అన్ని మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయడం జరిగిందన్నారు. ఇదే స్ఫూర్తితో రాబోయే ఎన్నికల్లో కూడా పార్టీ నాయకులు మరింత ఉత్సాహంగా పనిచేసి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించుకుని రాష్ట్ర వ్యాప్తంగా పులివెందుల సత్తా చాటాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు ఎమ్మెల్యే ఇంటింటా ప్రచారం

వీరపునాయునిపల్లె : మండలంలోని గంగిరెడ్డిపల్లె, సంగాలపల్లె, మిట్టపల్లె, లింగాల గ్రామాల్లో శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి ఇంటింటా ప్రచారం నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, వైఎస్సార్ అభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఘనంగా పుట్టపర్తి నారాయణ జయంతి


పుట్టపర్తి నారాయణాచార్యులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని ఆహార విజ్ఞానశాస్త్ర సాంకేతిక కళాశాలలో గురువారం పుట్టపర్తి నారాయణా చార్యులు జయంతిని నిర్వహించారు. ముందుగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంఎస్ బేగ్ అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి పుట్టపర్తి నారాయణా చార్యులు చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుట్టపర్తి నారాయణా చార్యులు 14 భాషలు నేర్చుకుని బహుభాషా పండితుడుగా అనిపించుకున్నారని, 14 ఏళ్ల వయస్సులోనే పద్య కావ్యాన్ని రాశారని, హృషికేశ్‌లో ఆయన ప్రతిభకు ముగ్ధుడైన శివానంద సరస్వతి ఆయనకు సరస్వతీపుత్ర బిరుదునిచ్చి సత్కరించారన్నారు. కార్యక్రమంలో స్టూడెంట్ యాక్టివిటీ అధికారి రాజేష్, అధ్యాపకులు, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీకి సత్కారం


ఎండీ ద్వారక తిరుమలరావును సత్కరిస్తున్న కార్మిక పరిషత్ నాయకులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న సీహెచ్ ద్వారక తిరుమలరావు ఐదు నేషనల్ అవార్డులు తీసుకోవడం అభినందనీయమని కార్మిక పరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసరావు, శేషగిరిరావులు పేర్కొన్నారు. గురువారం ఆర్టీసీ ఎండీని ఆయన కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

కోటేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకం

ఏపీఎస్ ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (ఆపరేషన్స్)గా పనిచేసిన కోటేశ్వరరావు సేవలు స్ఫూర్తిదాయకమని కార్మిక పరిషత్ నాయకులు తెలిపారు. ఈనెల 31వ తేదీన కోటేశ్వరరావు ఉద్యోగ విరమణ చేయనున్న సందర్భంగా వారు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో జోనల్ కార్యదర్శి ఎం.పురుషోత్తం, యూనియన్ నాయకులు కోసూరి సురేంద్ర, యార్లగడ్డ రమేష్, ఎస్.రాజేష్, రాష్ట్ర కమిటీ రీజినల్, జోనల్, డిపో కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చేర్చుకుంటాం.. మళ్లీ.. మళ్లీ

టీడీపీలో వింత పోకడ

కడప కార్పొరేషన్ : తెలుగుదేశం పార్టీలో ఇదివరకు చేరిన వారినే మళ్లీ మళ్లీ కండువాలు వేసి పార్టీలో చేరినట్లు గొప్పలు చెప్పుకోవడం పట్ల ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. 47వ డివిజన్‌కు చెందిన రాజశేఖర్‌రెడ్డి గతంలో తెలుగుదేశం పార్టీలో ఉండి 2019 ఎన్నికల ముందు వైఎస్సార్‌సీపీలో చేరారు. మున్సిపల్ ఎన్నికల్లో ఆయన సతీమణి 47వ డివిజన్ కార్పొరేటర్‌గా పోటీ చేసి ఓటమిపాలయ్యారు. దీంతో ఆయన పార్టీలో స్తబ్దుగా ఉంటూ ఇటీవల కడప టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి మాధవిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. తాజాగా టీడీపీ నేత శ్రీనివాసులరెడ్డి, మాధవీరెడ్డిలు గురువారం వారినే విజయవాడకు పిలుచుకుపోయి టీడీపీ అధినేత చంద్రబాబు సమక్షంలో వారికి మళ్లీ కండువాలు కప్పి పార్టీలో చేర్చుకోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తెలుగుదేశం పార్టీలో చేరేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతోనే ఇలా చేరిన వారికే మళ్లీ మళ్లీ కండువాలు కప్పుతూ పార్టీలో చేరికలంటూ గొప్పలు పోతున్నారని వైఎస్సార్‌సీపీ నేత జయచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు.

అభివృద్ధి సంక్షేమ ప్రదాతను ఆశీర్వదించండి


చిన్నపసుపుల గ్రామంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే ఎం.సుధీర్‌రెడ్డి


చెన్నూరు : ప్రచారం నిర్వహిస్తున్న జెడ్పీటీసీ పి. నరేన్ రామాంజులురెడ్డి

పెద్దముడియం : జగన్ సంక్షేమ పాలనకు ప్రజల ఆశీస్సులు మెండుగా ఉన్నాయని జమ్మలమడుగు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ ఎం.సుధీర్ రెడ్డి తెలిపారు. గురువారం మండలంలోని చిన్న పసుపుల, మేడిదిన్నె గ్రామంలో ఆయన గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలు, జరిగిన అభివృద్ధిని వివరించి ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి జగన్ అహర్నిశలు శ్రమించారన్నారు. అనుక్షణం పేదల సంక్షేమం కోసం పరితపిస్తున్న ఏకైక సీఎం జగన్ మోహన్‌రెడ్డి అని తెలిపారు. వెనుకబడిన వర్గాలను చంద్రబాబు ఓటు బ్యాంక్‌గా వాడుకుని వదిలేశారన్నారు. పేదల సంక్షేమం కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని తెలిపారు. మే 13న జరిగే ఎన్నికల్లో మరోసారి ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా వైఎస్ అవినాష్‌రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, మేడిదిన్నె గిరి, విష్ణువర్ధన్‌రెడ్డి, లక్ష్మీనారాయణ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, శివ తదితరులు పాల్గొన్నారు.

కులాలకు, మతాలకు, పార్టీలకు అతీతంగా అభివృద్ధి

చెన్నూరు : కులాలకు మతాలకు పార్టీలకు అతీతంగా అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు అందించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆదరించి ఆశీర్వదించాలని చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి ప్రజలను కోరారు. గురువారం మండలంలోని బలసింగాయపల్లి, కనపర్తి, షుగర్ ఫ్యాక్టరీ, ఎస్టీ రామాపురం గ్రామ పంచాయతీలో తన తండ్రి పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డికి, ఎంపీ అవినాష్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోలో ఏదైతే ప్రజలకు హామీ ఇచ్చారో అవన్నీ కూడా నెరవేర్చారన్నారు. ప్రతి ఇంటికి ప్రభుత్వం తరపున లబ్ధి జరిగి ఉంటేనే తనకు ఓటు వేయాలని చెప్పే దమ్మున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. గతంలో 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు నాయుడు ప్రజలకు ఏమీ చేయలేదని జన్మభూమి కమిటీలతో తనవారికి లబ్ధి చేకూర్చడం తప్ప ప్రజలకు చేసింది ఏమీ లేదన్నారు. అవ్వ తాతలు, అక్కా చెల్లెమ్మలు, అన్నదమ్ములు ఆలోచించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన ప్రజలను అభ్యర్థించారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు మెంబర్ మాసీమబాబు, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఆర్‌వీఎస్ఆర్, ఆర్ఎస్ఆర్, ప్రదీప్‌రెడ్డి, ఎంపీటీసీ రఘురాంరెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, గుమ్మళ్ల సాయికుమార్‌రెడ్డి ఈశ్వర్‌రెడ్డి, కెవి రమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, కమలాకర్, జనార్దన్‌రెడ్డి, రమణయ్య, రాజ, ఈశ్వరయ్య, నారాయణరెడ్డి, కృష్ణారెడ్డి, మైనార్టీ నాయకులుపాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


చలివేంద్రాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి

కమలాపురం : వేసవి కాలంలో పాదాచారులు, ప్రయాణీకుల దాహార్తిని తీర్చే చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అని ఎస్ఐ హృషికేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక ప్రభుత్వ కార్యాలయాల కాంప్లెక్స్ వద్ద రోడ్డుపై అభి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ విజయ్‌కుమార్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మజ్జిగ, ఆరెంజ్ జ్యూస్‌లను పాత్రికేయులతో కలసి ఎస్ఐ ప్రజలకు అందజేసి అనంతరం మాట్లాడారు. వేసవి తాపానికి గురై కొందరు సొమ్మసిల్లి పడిపోతుంటారని, అలాంటి వారికి చలివేంద్రాలు వరం లాంటివన్నారు. విజయ్‌బాబు సామాజిక సేవా దృక్పథం కలిగి ప్రజలకు సేవ చేయడం హర్షణీయం అన్నారు. ట్రస్ట్ ద్వారా మరిన్ని మంచి కార్యక్రమాలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

ఓటు హక్కు వినియోగంలో యువత ముందుండాలి

వైవీయూ : ఓటు హక్కు బాధ్యతగా వినియోగించుకోవడంలో యువత ముందుండాలని కడప నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రాకేష్ చంద్ర పేర్కొన్నారు. గురువారం కడపలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఓటర్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలన్నారు. ఓటు హక్కు వినియోగం పెరగడం ద్వారానే ప్రజాస్వామ్యం పరిడవిల్లుతుందన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా మాట్లాడుతూ సమర్థులైన పాలకులను ఎన్నుకునే వజ్రాయుధం ఓటుహక్కు అని, దాన్ని సక్రమంగా వినియోగించుకుని మంచి నాయకులను ఎన్నుకోవాలని సూచించారు.

జగనన్న ప్రభుత్వంలోనే రైతుకు భరోసా


నల్లపురెడ్డిపల్లెలో సాగులో ఉన్న అరటి


పులివెందుల రూరల్ : రైతు వేసే ప్రతి అడుగులోనూ రాష్ట్ర ప్రభుత్వం తోడుగా నిలుస్తోంది. మాటలోనే కాకుండా చేతుల్లోనూ చూపిస్తోంది. ప్రతి ఏడాది ఖరీఫ్ రాగానే పంట పెట్టుబడులకు రైతులు ఇబ్బందులు పడకుండా జూన్‌లోనే మొదటి విడతగా వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద రూ.7500లు క్రమం తప్పకుండా రైతుల ఖాతాల్లో జమచేస్తూ భరోసా ఇస్తున్నారు. మరోవైపు బ్యాంకుల ద్వారా పంట రుణాల రెన్యువల్స్, కొత్తరుణాల పంపిణీకి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. పంట పెట్టుబడులు వస్తున్నా దిగుబడులు బేరీజు చేసుకుని రైతులకు మేలు చేస్తున్నారు. దీంతో రైతుల ఖరీఫ్ సేద్యం సాఫీగా సాగిస్తున్నారు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతులకు బ్యాంకుల ద్వారా అందించే పంట రుణాలకు సంబంధించి స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పెరిగేలా చర్యలు చేపట్టింది. కేంద్ర సహకార బ్యాంకు, నాబార్డు, లీడ్ బ్యాంకు, ప్రధాన బ్యాంకర్లు, వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులతో సమావేశాలు ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన వసతులను అందిస్తున్నారు. రైతులు కూడా ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుంటున్నారు.

ఆధునిక పరిశోధనలతో ఆర్థికాభివృద్ధి

వైవీయూ : ఆధునిక పరిశోధనలు చేపట్టడం ద్వారా ఆర్థికంగా కూడా అభివృద్ధి సాధ్యమవుతుందని బెంగుళూరు ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ గౌరవ శాస్త్రవేత్త డాక్టర్ సంజప్ప పేర్కొన్నారు. కడప నగరంలోని నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో నిర్వహించిన రెండురోజుల వర్క్‌షాపు ముగింపు కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవశాస్త్రంలో ఆధునిక పరిశోధనలు చేయడం ద్వారానే నూతన ఆవిష్కరణలు జరుగుతాయన్నారు. అనంతరం శాస్త్రవేత్తలు డా.ఆర్.ఆర్.రావు, వైవీయూ వృక్షశాస్త్ర ఆచార్యులు డా. ఎ.మధుసూదన్‌రెడ్డి, ప్రభుత్వ పురుషుల కళాశాల అధ్యాపకురాలు డా.పి. కల్పన జీవశాస్త్రంలో జరిగే పరిశోధనలపై మాట్లాడారు. కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

పాపుల కోసం క్రీస్తు ప్రాణత్యాగం

నేడు గుడ్‌ఫ్రైడే


పునరుత్థానమే ఈస్టర్

కడప కల్చరల్ : లోకంలోని పాపులను పరిశుద్ధులను చేసేందుకు, వారికి క్షమను అందించేందుకు కరుణామయుడైన ఏసుక్రీస్తు శిలువపై తన ప్రాణాలను బలిపెట్టిన రోజే గుడ్‌ఫ్రై డే. దీన్నే శుభ శుక్రవారం అని కూడా ఉంటారు. క్రైస్తవులందరూ ఈ శుభ శుక్రవారాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు. ఈ శుక్రవారం నాడే కల్వరిగిరిపై క్రీస్తును శిలువపై శిక్షించారు. ప్రాణత్యాగ సమయంలో కూడా క్రీస్తు తనకు మరణ శిక్షను అమలు చేస్తున్న రోమ సైనికుల కోసం లోక రక్షకుడైన తన తండ్రితో 'తండ్రి వీరు ఏమి చేస్తున్నారో ఎరుగరు...వీరిని క్షమింపుము'అని ప్రార్థించారు. తన దయ, కరుణ తత్వాలను లోకానికి చాటారు. శిలువపై మరణిస్తున్న సమయంలో ఆయన చెప్పిన ఏడు సూక్తులు లోకానికి ఆరాధ్యాలయ్యాయి.

కల్వరి కొండమీద శిలువపై మరణించిన క్రీస్తును అక్కడి కొండ గుహలో సమాధి చేశారు. మూడోరోజు ఆదివారం ఆయన పునరుత్థానం పొంది తిరిగి తన శిష్యులకు దర్శనమిచ్చాడు. 'నేను జీవమును'అన్న మాటకు నిదర్శనంగా నిలిచి లోకానికి తన దివ్య మహిమను చాటాడు. ఆయన పునరుత్థానం చెందిన ఆదివారాన్నే ఈస్టర్ సండేగా వ్యవహరిస్తారు. అశాంతితో తల్లడిల్లుతున్న నేటి ప్రపంచానికి క్రీస్తు ప్రబోధించిన ప్రేమ, దయ, క్షమ గుణాలు ఆదర్శం కావాలని ఆశిద్దాం.

ముగిసిన లెంట్‌డేస్

గుడ్‌ఫ్రైడేను పురస్కరించుకుని క్రైస్తవ లోకం 40 రోజులపాటు లెంట్‌డేస్ (శోక దినాలు) నిర్వహిస్తోంది. ఈ సమయంలో క్రైస్తవులు ఎలాంటి శుభకార్యాలు చేయరు. నిరంతరం దైవ ధ్యానంలోనే గడుపుతారు.పొరపాటున కూడా చెడు పనులకు పాల్పడకుండా జాగ్రత్త పడతారు. కనీసం నూతన దుస్తులు కూడా ధరించరు.

పిల్లల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


చిన్నారులతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప కోటిరెడ్డిసర్కిల్ : వేసవి కాలంలో చిన్న పిల్లల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫకృద్దీన్ తెలిపారు. గురువారం కడప నగరంలోని కొండాయపల్లెలో ఉన్న శిశు గృహాన్ని ఆయన సందర్శించారు. అనంతరం మాట్లాడుతూ శిశు గృహంలో ఉన్న పిల్లల వివరాలు, వారికి అందుతున్న సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. బాలల సంరక్షణ కోసం స్నేహపూర్వక న్యాయ సేవల పథకం-20215 గురించి వివరించారు. ఏవైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో శిశు గృహ మేనేజర్ కుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఈఓ, విద్యాశాఖకు అభినందనలు

కడప ఎడ్యుకేషన్ : జిల్లాలో పదవ తరగతి పరీక్షలను ఏ సమస్యలు లేకుండా ప్రశాంతంగా పూర్తి చేసినందుకు జిల్లా విద్యాశాఖ అధికారి మర్రెడ్డి అనురాధకు ఎస్టీయూ జిల్లాశాఖ అభినందనలు తెలిపింది. గురువారం మాజీ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డిలతో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఇలియాస్‌బాషా, సంగమేశ్వరరెడ్డి డీఈఓ కార్యాలయంలో డీఈఓను కలిసి పరీక్షలను దిగ్విజయంగా పూర్తి చేసినందుకు ఆమెకు, విద్యాశాఖకు అభినందనలు తెలిపారు.

మూల్యాంకన కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలి

ఏప్రిల్ 1వ తేదీ నుంచి నిర్వహించబోయే పదోతరగతి మూల్యాంకన కేంద్రంలో ఉపాధ్యాయులకు సదుపాయాలను కల్పించాలని ఎస్టీయూ నేతలు కోరారు. ఈ విషయమై గురువారం డీఈఓ మర్రెడ్డి అనురాధకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూల్యాంకన విధులకు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి, న్యూరో సర్జన్, ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించున్న వారికి, చంటి బిడ్డల తల్లులకు మినహాయింపు ఇచ్చి సిబ్బందికి మజ్జిగ, నీరు, కూలర్లను ఏర్పాటు చేయాలన్నారు.

రైల్వే ట్రాక్ కోసం వేగంగా సర్వే


సర్వే పనులు చేసేందుకు సిద్ధంగా ఉన్న యంత్రాలు

పులివెందుల రూరల్ : ముద్దనూరు నుంచి పులివెందుల సత్యసాయి జిల్లా, ముదిగుబ్బ, పుట్టపర్తి, ప్రశాంతినిలయం రైల్వేస్టేషన్ వరకు కొత్త రైల్వే ట్రాక్ కోసం సర్వే పనులు వేగంగా జరుగుతున్నాయి. 110 కిలో మీటర్లు రైల్వే ట్రాక్ కోసం నాలుగు సర్వే బృందాలు యంత్రాల సాయంతో 30 అడుగుల లోతులో మట్టి నమూనాలను సేకరిస్తున్నారు. ప్రస్తుతం పులివెందుల మండలంలోని నల్లపురెడ్డిపల్లె పొలాల్లో, లింగాల మండలంలోని ఇప్పట్ల పొలాల్లో సర్వే పనులు జరుగుతున్నాయి. ముద్దనూరు నుంచి పులివెందుల మీదుగా వెళ్తున్న రైల్వే మార్గం ముదిగుబ్బ, పెనుగొండ రైల్వే స్టేషన్‌ను కలుపుతూ ప్రశాంతి నిలయం రైల్వేస్టేషన్ వద్ద కలుస్తుంది. రైల్వేమార్గం పనులు పూర్తి అయితే జిల్లా వాసులే కాక పులివెందుల-ముదిగుబ్బ-హిందూపురం మీదుగా బెంగుళూరు వరకు తక్కువ సమయంలో చేరుకోవచ్చు. రైల్వేమార్గం కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమాన వాటాలో నిధులు భరించనున్నాయి. రైల్వే మార్గం కోసం కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కేంద్ర రైల్వేశాఖ మంత్రి, కేంద్ర మంత్రులతో అనేకమార్లు చర్చించి రైలు మార్గాన్ని సుగమం చేసినందుకు కడప జిల్లా, పులివెందుల, ముద్దనూరు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జగనన్న ప్రభుత్వంలోనే మైనార్టీలకు రక్షణ

జమ్మలమడుగు రూరల్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే మైనార్టీలకు రక్షణ ఉంటుందని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ బి.గౌస్‌లాజం, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ అగస్టిన్‌లు తెలిపారు. గురువారం పెద్దముడియం మండలంలోని చిన్నపసుపుల గ్రామంలో ముస్లిం మైనారిటీల గడప గడపకు వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మైనార్టీలకు జరిగిన లబ్ధి గురించి వారు వివరించారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించడంతో అనేక మంది విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాల్లో ఉన్నారన్నారు. చంద్రబాబునాయుడు చేసే మోసపూరిత వాగ్దానాలను ఎవరు నమ్మవద్దన్నారు. త్వరలో జరిగే ఎన్నికల్లో ఎంపీగా పోటీచేస్తున్న వైఎస్ అవినాష్‌రెడ్డిని, జమ్మలమడుగు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న డాక్టర్ మూలే సుధీర్‌రెడ్డిని ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వారు ఓటర్లకు అభ్యర్థించారు. కార్యక్రమంలో భాస్కర్, బిఎస్ గౌస్, రిజ్వాన్, షామీర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న చీనీ ధరలు..

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు


విక్రయించేందుకు వ్యవసాయ మార్కెట్‌కు తరలించిన చీనీ కాయలు


పులివెందుల రూరల్ : వేసవి కాలం కావడంతో పులివెందులలోని వ్యవసాయ మార్కెట్‌లో చీనీ ధరలు రోజురోజుకు పెరుగుతుండటంతో చీనీ పంటలు పండించే రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పులివెందుల, లింగాల, సింహాద్రిపురం మండలాల్లోని గ్రామీణ ప్రాంతాల్లో రైతులు పండించిన పంటలను పులివెందుల వ్యవసాయ మార్కెట్‌కు తీసుకువచ్చి అమ్ముతున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో రైతుల సంక్షేమం కోసం పులివెందులలో చీనీకాయల కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఇతర జిల్లాలోని మార్కెట్‌లో కంటే పులివెందుల వ్యవసాయ మార్కెట్ కొనుగోలు కేంద్రంలో ధరలు మె రుగ్గా ఉండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా రు. గురువారం పులివెందుల వ్యవసాయ మార్కెట్‌లోని చీనీ కొనుగోలు కేంద్రంలో మేలురకం, నాణ్యమైన చీనీ కాయలు టన్ను ధర రూ.26,500 లు ఉండగా, ఒకరకమైన చీనీకాయల టన్ను ధర రూ.21,500లు పలుకుతున్నట్లు మార్కెట్‌యార్డు అధికారులు తెలిపారు.

అద్వితీయ ప్రతిభామూర్తి 'పుట్టపర్తి'


పుట్టపర్తి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : పద్నాలుగు భాషల్లో పాండిత్యం కలిగి కవిగా, విమర్శకుడుగా, ఉపన్యాసకుడిగా, అనువాదకుడిగా, నాటకకర్తగా వెలుగొంది నూటికి పైగా గ్రంథాలు రచించిన 'సరస్వతీపుత్ర'డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యులు అద్వితీయ ప్రతిభామూర్తి అని సీపీ బ్రౌన్ బాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య టి.రామప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. యోగివేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో గురువారం ఉదయం డాక్టర్ పుట్టపర్తి నారాయణాచార్యుల జయంతిని నిర్వహించారు. తొలుత పద్మశ్రీ పుట్టపర్తి చిత్రపటానికి పూలమాల అలంకరించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక తెలుగు సాహిత్యంలో రాయలసీమ కీర్తిని నలుదిక్కులా చాటిన పద్మశ్రీ పుట్టపర్తి 14వ ఏట రచించిన 'పెనుగొండలక్ష్మి'కావ్యం ఆయనకు విద్వాన్ పరీక్షలో పాఠ్యాంశం కావడం సాహిత్య చరిత్రలోనే ఒక అరుదైన సంఘటన అన్నారు. ప్రొద్దుటూరులోని అగస్త్యేశ్వరుడినే కావ్యనాయకునిగా ఆయన రచించిన 'శివతాండవ'కావ్యం ఎనలేని కీర్తిప్రతిష్ఠలను సంపాదించి పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారం, శ్రీవేంకటేశ్వర, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాలు గౌరవ డాక్టరేట్‌తో సత్కరించాయన్నారు. బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి, సహాయపరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, కొత్తపల్లె రామాంజనేయులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్ ఆర్.వెంకట రమణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

మానవాళికి మార్గదర్శి పవిత్ర ఖురాన్


పవిత్ర ఖురాన్ పఠిస్తున్న చిన్నారి

కడప కల్చరల్ : ప్రపంచంలోని ముస్లింలందరికీ నెల రోజుల పండుగ రంజాన్. దివ్య ఖురాన్ దైవం నుంచి ఈ భువికి అవతరించిన మాసం కూడా ఇదే. రంజాన్ మాసం కొనసాగుతున్న సందర్భంగా ఆ మోక్షదాయిని ఖురాన్ గురించి పలువురు ఇస్లాం మత గురువులు, పెద్దలు తెలియజేశారు.

అంతిమ దైవ ప్రవక్తగా అవతరించిన మహమ్మద్ (సా.అ.వ) తరుచూ అల్లాహ్ నుంచి ఆదేశాలు అందుకునే వారు. ఆ క్షణంలో ఆయన దివ్యమైన అనుభూతిని ఆస్వాదించేవారు. దైవం నుంచి తనకు అందిన సందేశాలను తన అనుచరులకు వివరించేవారు. వారు ఆయన చెప్పిన మాటలను రాసి పెట్టి తర్వాత ప్రవక్తకు వినిపించేవారు. ఆయన అనుమతితో ఆ రాతలను భద్రపరిచేవారు. అలా 23 సంవత్సరాలపాటు దైవ సందేశాలు ప్రవక్తకు అందాయి. ఆ మొత్తం సందేశమే దివ్య ఖురాన్‌గా మానవాళికి సన్మార్గ దర్శినిగా నేటికీ విరాజిల్లుతోంది. దీంతో ఈ మాసం ప్రపంచంలోని ముస్లింలందరికీ పవిత్రమైనదిగా మారింది.

సన్మార్గ దర్శిని

దైవం దివ్య ఖురాన్‌ను ప్రపంచ మానవాళికి మహిమాన్విత వరంగా ప్రసాదించారు. అజ్ఞానపు చీకట్ల నుంచి విజ్ఞానమనే వెలుగు బాటను చూపిన ఈ దివ్య గ్రంథం మానవుడి అవివేకాన్ని తుడిచి పెట్టేందుకు ఉత్తమమైన మార్గంగా నిలుస్తోంది. మామూలు వ్యక్తిని కూడా మహోన్నతునిగా మార్చేందుకు మూలంగా నిలిచింది. ఖురాన్ పేరిట మానవాళికి అందిన ఈ వరాల మూటలో మొత్తం 30 భాగాలు ఉన్నాయి. మొదటి భాగం 'ఎఖ్రా' (విద్య)కు సంబంధించినది. దీని ద్వారా ముస్లింలకు చదువు తప్పనిసరి అన్న సూచన అందుతోంది. చదువు విలువను ఈ దివ్య గ్రంథంలోని ఈ భాగం ద్వారా తెలుసుకోవచ్చు. మనిషిని ఉత్తముడిగా మార్చేందుకు ఇందులో ఎన్నో సూచనలు ఉన్నాయి. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లింలు అనుసరించాల్సిన విధుల గురించి తెలిపి మామూలు మనిషిని ఉత్తముడిగా మార్చేందుకు ఈ సూచనలు ఉపయోగపడుతున్నాయి. ముఖ్యంగా ఈ మాసంలో ధనికులు జకాత్, ఫిత్రాలను సక్రమంగా అందజేస్తే రంజాన్ ఈద్ ప్రార్థన సమయానికి పేదలనే వారు ఉండరని ఈ గ్రంథం వివరిస్తుంది. మానవుడిలోని మద్యం, వ్యభిచారం, పాపం, ద్రోహం, హింస, చెడుగా చెప్పడం, కించపరచాలనుకోవడం తదితరాలను ఈ గ్రంథం తీవ్రంగా నిరసిస్తుంది. నైతిక విలువలతో జీవించాలని ప్రబోధిస్తుంది. ముఖ్యంగా స్త్రీలను బానిసలుగా చూడకూడదని, పురుషులతో సమానంగా అన్ని హక్కులు కల్పించాలని, వాటి రక్షణ బాధ్యత పురుషుడే వహించాలని సూచిస్తోంది. అనాథలు, వితంతువులకు సహాయ కారులుగా ఉండాలని సూచిస్తోంది.

సర్వోన్నతుడు

ప్రపంచ మానవాళిని వారిని సహకరించేలా ఉన్న ప్రకృతిని, ఇతర చరాచర జీవులను సర్వోన్నతుడైన అల్లాహ్ సృష్టించారని ఈ గ్రంథం తెలుపుతోంది. అందుకే వారికి మినహా ఎవరికీ కృతజ్ఞతలు అర్పించకూడదని, ప్రార్థనలు చేయకూడదని చెబుతోంది. ఆయన ప్రకృతిలో ఎంతో విలువైన సంపదల నిధులను ఉంచారని, మానవుడు స్వశక్తితో విద్య ద్వారా సాధించిన జ్ఞానంతో వాటిని పొందవచ్చని సూచించినట్లు ఈ దివ్య గ్రంథం ప్రబోధిస్తుంది.

సశాస్త్రీయమైనది

దివ్య ఖురాన్ గ్రంథం ఎంత పవిత్రమైనదో అంత సశాస్త్రీయమైనది కూడా అని ప్రపంచ మేధావులంతా కొనియాడుతున్నారు. ప్రకృతిలో చెట్టు ఎంత విలువైనదో ఈ గ్రంథంలో కొన్నిచోట్ల ప్రస్తావించారు. మానవాళికి చెట్టు ఎంతగా ఉపయోగపడుతుందో కూడా ఇందులో వివరించారు.